కాంగ్రెస్‌కు వారెంటీ.. పథకాలకు గ్యారెంటీ లేదు

- ఆ పార్టీలో ప్రతి జిల్లా నుంచి ఒక్కో ముఖ్యమంత్రి అభ్యర్థి
- మూడోసారి బీఆర్ఎస్ గెలుపు పక్కా..
- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- పశ్చిమ నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రచారం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 22: ప్రజల్లో ఆదరణ, పలుకుబడిలేని నాయకులు వారంటీ లేని పార్టీ, గ్యారంటీ లేని ఆరు పథకాలతో ముందుకు వస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని వేయిస్తంభాల గుడిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రోడ్డుపై బండి దగ్గర టిఫిన్ చేసి, వివిధ కాలనీల్లో ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ చారిత్రక నగరానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు మరోసారి బీఆర్ఎస్ పార్టీపై, సీఎం కేసీఆర్‌పై అనేక ఆరోపణలు, పసలేని, పొంతనలేని ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఎన్నికల షెడ్యూల్ డిక్లేర్ అయినప్పటి నుంచి అభ్యర్థులే ప్రకటించలేని నిస్సాయస్థితిలో కాంగ్రెస్, బీజేపీ ఉందన్నారు. కాంగ్రెస్ పెట్టిన ఏ ఒక్క సభ కూడా సక్సెస్ కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి జిల్లా నుంచి ఒక్కో ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీ పడుతున్నారని, ఎన్నికలు వచ్చినప్పుడే వారికి ఇవన్నీ గుర్తుకొస్తాయని విమర్శించారు. సీఎం కేసీఆర్ నిరంతరం ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతూ, అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అవలంబిస్తున్నారన్నారు. దేశంలోనే ఎక్కడాలేని సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తూ ముందుకు తీసుకెళుతున్నారన్నారు. అబద్ధాల హామీలతోని ప్రతి ఎన్నికల్లో ముందుకు వస్తున్న ప్రతి పక్ష నాయకులను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ పాలించే రాష్ట్రాల్లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతు బీమా, నిరంతర విద్యుత్‌లాంటి పథకాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా, ఎన్ని ప్రచారాలు చేసినా కాంగ్రెస్ పార్టీ ఇప్పుడున్న సీట్లు కూడా నిలబెట్టుకోలేని స్థితిలో ఉందని వినయ్‌భాస్కర్ అన్నారు. ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, నయీముద్దీన్, పేర్ల మనోహర్, కోన శ్రీకర్, రావుల సుదర్శన్ పాల్గొన్నారు.

రోడ్డుపై బండి వద్ద టిఫిన్ చేస్తున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్


బీఆర్ఎస్‌లో చేరిన కేశవాపురం కార్యకర్తలను ఆహ్వానిస్తున్న మంత్రి

కారు జోరుకు ప్రతిపక్ష పార్టీలు బేజారు

రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బీఆర్ఎస్‌లో చేరిన రాయపర్తి, కేశవాపురం గ్రామాల కార్యకర్తలు

రాయపర్తి, అక్టోబర్ 22 : పాలకుర్తి నియోజకవర్గంలో కారు పార్టీ జోరును చూస్తున్న ప్రతిపక్ష పార్టీలన్నీ బేజారవుతున్నాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అన్ని గ్రామాల ముఖ్యకార్యకర్తలు, నాయకులతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్తలు అయిత రాజు, జంపయ్య, రాకేశ్, రాము, ప్రశాంత్, రాఘవ్, మహేశ్, రాజు, సందీప్, చంద్‌తోపాటు కేశవాపురం పంచాయతీ పరిధి జగ్యాతండాకు చెందిన భూక్యా వెంకన్ననాయక్, దస్రూనాయక్, సంక్రూనాయక్, సీతారాం, హరిలాల్, రవి, దస్రూల సారథ్యంలో సుమారు 50 మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతున్నట్లు చెప్పారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీలు పాలకుర్తి నియోజకవర్గానికి ఏం చేశాయని ఆయన మండిపడ్డారు. పార్టీలో చేరుతున్న వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, నాయకులు పూస మధు, చిలుమల్ల యాకయ్య, సూదుల దేవేందర్‌రావు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, మొలుగూరి పున్నమయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మండల కేంద్రంలోని రజక కాలనీకి చెందిన జర్నలిస్టు మచ్చ రాజు తల్లి పద్మ (52) ఆదివారం మృతి చెందగా విషయం తెలుసుకున్న మంత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే, కిష్టాపురం క్రాస్ రోడ్డులో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మొరిపిరాల గ్రామానికి చెందిన తండ్రీకూతుళ్లు ఓరుగంటి వెంకన్న, ముంజంపల్లి అనూష అక్కడికక్కడే మృతి చెందగా తొర్రూరులోని మార్చూరి గదిలో వారి మృతదేహాలకు మంత్రి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. మైలారం గ్రామానికి చెందిన లెక్కల ప్రమీల అనారోగ్యంతో బాధపడుతుండగా మంత్రి ఎర్రబెల్లి ఆమెను పరామర్శించారు. మంత్రి వెంట నాయకులు గారె నర్సయ్య, మచ్చ సత్యం, మచ్చ వెంకన్న, గూడెల్లి వెంకన్న, ఉబ్బని సింహాద్రి, ముద్రబోయిన సుధాకర్, మహ్మద్ అక్బర్ ఉన్నారు.

పూజలు చేస్తున్న తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలి

తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 22 : జగన్మాత దీవెనలతో అందరూ సంతోషంగా ఉండాలని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. శనివారం వరంగల్ అండర్ బ్రిడ్జి వద్దనున్న నాగమాత ఆలయ ఆవరణలో మార్వాడీ సిక్వాల్ బ్రాహ్మన్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మార్వాడీ యువత, చిన్నారులతో దాండియా ఆడారు. ఈ సందర్భంగా నన్నపునేని మాట్లాడుతూ శక్తి స్వరూపినైన అమ్మవారి దీవెలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మార్వాడీ సమాజ్ ప్రతినిధులు, స్థానిక డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- ఎనిమిదో రోజు ప్రత్యేక పూజలు
- వివిధ అలంకారాల్లో అమ్మవారి దర్శనం

వరంగల్, అక్టోబర్ 22 : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎనమిదో రోజు ఆదివారం భద్రకాళీ అమ్మవారు మహిషామర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అర్చకులు నిత్యహ్నికం నిర్వహించి, అమ్మవారిని మహిషాసుర మర్ధినిగా అలంకరించారు. భద్రకాళీ జన్మోత్సవం పురస్కరించుకొని ఉదయం, సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈవో శేషుభారతి ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు తెప్పోత్సవం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం విజయదశమి పురస్కరించుకొని భద్రకాళీ తటాకం (చెరువు)లో తెపోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 7 గంటలకు ప్రత్యేకంగా తయారుచేసిన హంస వాహనంపై చెరువులో భద్రకాళీ అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. కాగా, నగరంలోని ఎంజీఎం సెంటర్ ఉన్న రాజరాజేశ్వరి దేవీ ఆలయంలో దుర్గా అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

మహాగౌరీ అలంకరణలో పద్మాక్షి

హనుమకొండ : శ్రీహనుమద్గిరి పద్మాక్షి ఆలయంలో అమ్మవారు మహాగౌరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనట్లు అర్చకులు నాగిళ్ల శంకర్‌శర్మ, వేద పండితుడు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. అనంతరం హోమం, అన్నదానం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

వేయిస్తంభాల గుడిలో..

హనుమకొండ చౌరస్తా : చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో లక్షగాజులతో పూజ నిర్వహించి అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. సాయంత్రం మహిషాసురమర్ధినిగా అలంకరించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం సింహవాహనంపై వాహనసేవ నిర్వహించారు. కార్యక్రమంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పాల్గొని దుర్గాదేవికి పూజలు చేశారు. ఈ సందర్భంగా కుడా గార్డెన్‌లో మల్లికాంబ మనోవికాస కేంద్రం మానసిక దివ్యాంగులకు ప్రసాద వితరణ చేశారు. భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు కూడా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్సవ సేవాసమితి సభ్యులు పల్లం రమేశ్, కోన శ్రీకర్, పులి రజినీకాంత్, రావుల సుదర్శన్ సేవలందించారు. ఈవో వెంటయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.


వరంగల్ : మహిషామర్దిని అలంకరణలో దర్శనమిస్తున్న భద్రకాళీ అమ్మవారు

హనుమకొండ చౌరస్తా : వేయిస్తంభాల గుడిలోని అమ్మవారికి పూజలు చేస్తున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

వరంగల్ : దుర్గా అలంకరణలో రాజరాజేశ్వరీ దేవి

హనుమకొండ : మహాగౌరీ అలంకరణలో పద్మాక్షి అమ్మవారు